www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 139 | హైదరాబాద్ | శుక్రవారం | 12-09-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## దోస్తు ద్వారా డిగ్రీలో చేరటానికి మరొక అవకాశం




**సిద్దిపేట బ్యూరో:**

డిగ్రీలో ప్రవేశం పొందడానికి దోస్త్ ద్వారా మరొక మారు అవకాశం లభించిందని ఆసక్తిగల అభ్యర్థులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి జీవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.డిగ్రీలో చేరబోయే అభ్యర్థులు ఈనెల 15, 16 తేదీలలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, మహిళా కళాశాలలో బిఏ లో 45 సీట్లు,బీకాంలో 30 సీట్లు, బిఎస్సి లైఫ్ సైన్స్ లో 31సీట్లు, బిఎస్సి ఫిజికల్ సైన్స్ లో 17 సీట్లు,మొత్తంగా 123 సీట్లు అందుబాటులో ఉన్నాయని అభ్యర్థులు ఈ చక్కని అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.





## దేశంలో అత్యధిక ఆస్తులు కల్గిన ప్రాంతీయ పార్టీగా బీఆర్ఎస్

- 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఏడీఆర్ నివేదిక వెల్లడి
- రూ.685.51 కోట్ల ఆదాయంతో బీఆర్ఎస్‌కు అగ్రస్థానం
- టాప్-5లో చోటు దక్కించుకున్న టీడీపీ, వైసీపీ
- రెండో స్థానంలో టీఎంసీ, మూడో స్థానంలో బీజేడీ
- మొత్తం ఆదాయంలో 83 శాతం వాటా ఈ ఐదు పార్టీలదే

# జెన్‌కోకు జీఎస్టీ షాక్

### వచ్చే ఏడాది విద్యుత్ బిల్లుల భారం




బొగ్గుపై13 శాతం పెరగనున్న జీఎస్టీ

టన్నుకు రూ.630 అదనం

ఏటా రూ.425 కోట్ల జీఎస్టీ వడ్డింపు

ఈ మొత్తం విద్యుత్ వినియోగదారులపైకే..

ఈఆర్సీ అనుమతి కోసం జెన్‌కో కసరత్తు

**హైదరాబాద్ సెప్టెంబర్ 11(సిద్దిపేట పవర్):**

విద్యుత్ వినియోగదారులకు జీఎస్టీ షాక్ తగలబోతోంది. వస్తు సేవల పన్నుకు సంబంధించి కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం విద్యుత్ ఉత్పత్తి సంస్థలపై ప్రభావం చూపుతోంది. జెన్‌కో వాడే బొగ్గు ప్రస్తుతం 5 శాతం జీఎస్టీ పరిధిలో ఉంది. కొత్త శ్లాబులు అమలులోకి వస్తే ఇది 18 శాతానికి పెరుగుతుంది. అదనంగా 13 శాతం భారం పడుతుంది. దీనివల్ల ప్రతి టన్ను బొగ్గుపై అదనంగా రూ.630 భారం పడే అవకాశం ఉంది. ప్రభుత్వ రంగ సంస్థ జెన్‌కో కాకుండా, పలు ప్రైవేటు సంస్థలతో విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయి.

ఇవి కూడా దేశీయ, విదేశీ బొగ్గును కొనుగోలు చేస్తున్నాయి. వీటిపై పడే జీఎస్టీ భారాన్ని విద్యుత్ వినియోగదారులే భరించాల్సి ఉంటుంది. పెరిగే భారం ఎంత అనేది అధికారులు లెక్కగట్టాల్సి ఉంది. ఈ మొత్తానికి చార్జీలు పెంచుకునేందుకు విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)

..మిగతా 2లో

## రైల్వే ప్రాజెక్టులపై ఫోకస్

- వికారాబాద్– కృష్ణా కొత్త లైన్ పనులను త్వరగా చేపట్టాలి
- ఇండస్ట్రియల్ కారిడార్ కోసం స్పెషల్ లైన్
- శంషాబాద్ – చెన్నై బుల్లెట్ ట్రైన్ ప్రతిపానను పరిశీలించాలి
- ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

పెండింగ్లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్మెంట్లు ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో

..మిగతా 2లో

## జూబ్లీహిల్స్‌లో పార్టీల ఎత్తుకు పై ఎత్తు..

- ఈ నెలాఖరున నోటిఫికేషన్ వచ్చే అవకాశం
- అభ్యర్థుల ఎంపికపై ప్రధాన పార్టీలు కసరత్తు
- సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకునేందుకు బీఆర్ఎస్ ప్లాన్
- జూబ్లీహిల్స్ సీటు కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రణాళికలు
- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఎవరనేది సర్వత్రా ఉత్కంఠ




**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఆసక్తిగా మారింది. ఈ నెలాఖరు నాటికి నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు స్పీడ్ పెంచాయి. సిట్టింగ్ స్థానాన్ని తిరిగి దక్కించుకునేందుకు బీఆర్ఎస్ మాగంటి గోపీనాథ్ సతీమణినే బరిలోకి దింపబోతున్నట్లు హింట్ ఇచ్చింది. దీంతో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఎవరు అనేది ఆసక్తిగా మారింది. ఇప్పటికే కంటోన్మెంట్ బై ఎలక్షన్ లో కారు పార్టీకి డ్యాష్ ఇచ్చామని ఇప్పుడు జూబ్లీహిల్స్ లోనూ అదే రిపీట్ చేసి గట్టి షాక్ ఇవ్వాలని అధికార కాంగ్రెస్

..మిగతా 2లో

## ఖర్గే మాటలు చూస్తే నవ్వొస్తుంది..

- కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది
- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌పై ఇండియా కూటమిని ఎద్దేవా
- యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వమే కారణం
- ఉద్యోగులు, విద్య, జీతాల అంశాలపై సీఎం వాగ్దానాలు ఏమయ్యాయ్
- బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, రాజ్యాంగ నియమాలను ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. రామచందర్ రావు ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ, "మైక్ కూడా ప్రభుత్వంలాగే పనిచేస్తున్నట్టు ఉంది, అప్పుడప్పుడు చెప్పినట్టు వినదు" అంటూ చురకలు అంటించారు. ఆయన చేసిన ప్రధాన వ్యాఖ్యలు: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జరిగిన క్రాస్ ఓటింగ్‌ను చూస్తే ఇండియా కూటమిలో ఐక్యత లేదని తేలిపోయిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగినంత రాజ్యాంగ అవహేళన ఎప్పుడూ జరగలేదని ఆయన విమర్శించారు. గవర్నర్ మాత్రం రెండు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు ఇస్తారని, కానీ స్పీకర్ మాత్రం

..మిగతా 2లో

## కేటీఆర్‌కు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారం

- ప్రతిష్ఠాత్మక 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఎంపిక
- పర్యావరణ పరిరక్షణ కృషి చేశారంటూ పురస్కారం
- అమెరికాలోని న్యూయార్క్‌లో జరగనున్న అవార్డు ప్రదానోత్సవం
- ఈ నెల 24న 'ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్'లో పురస్కార ప్రదానం



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. పర్యావరణ పరిరక్షణకు కేటీఆర్

..మిగతా 3లో

## వాసవిలో ఫ్లాట్లు కొంటే.. పాట్లే!

- డ్రీమ్ హోమ్.. లేక్ సిటీ అంటూ బయ్యర్లకు కుచ్చుటోపీ
- వాసవి మోసాలపై రోడ్డెక్కిన వినియోగదారులు
- వరుస ఫిర్యాదులతో కొరడా ఝుళిపించిన రేరా
- చెల్లించిన మొత్తంపై 10.85% వడ్డీతో ఇవ్వాలని అల్టిమేటం



**హైదరాబాద్ సెప్టెంబర్ 11(సిద్దిపేట పవర్):**

ప్రతి ఒక్కరికీ ఓ సొంతిల్లు ఉండాలన్నది కల.. ఆ కలను నెరవేర్చుకునేందుకు సగటు మనిషి జీవితాంతం పోరాడుతాడు.. రూపాయి.. రూపాయి కూడబెట్టి తమ కలల సౌధంలో హాయిగా జీవనాన్ని గడపాలనుకునే

..మిగతా 2లో

## మహేశ్ బాబు వల్లే మా దశ తిరిగింది..

- అసలు విషయం చెప్పిన అభిబస్ సీఈఓ
- మహేశ్ రాకముందు రోజుకు 3 వేల టికెట్ల అమ్మకాలు మాత్రమే
- ఆయన చేరాక రోజుకు 20 వేల టికెట్లకు పెరిగిన విక్రయాలు
- మా బ్రాండ్ విలువను పెంచింది మహేశేనని ప్రశంస




www.siddipetpower.com

WWW.SIDDIPETPOWER.COM



# వాసవిలో ఫ్లాట్లు కొంటే.. పాట్లే!

మొదటిపేజీ తరువాయి

వారి ఆశలపై నీళ్లు చల్లుతూ.. కొందరు రియల్ వ్యాపారులు అందినంత దండుకుంటున్నారు.. చిన్న చిన్న రియల్ వ్యాపార సంస్థలే ఇలా చేస్తారనుకుంటున్న తరుణంలో ఈ కోవలోకి ప్రముఖంగా పేరొందిన బడా రియల్ ఎస్టేట్ సంస్థ వాసవి గ్రూప్ ఈ జాబితాలో చేరింది.

డ్రీమ్ హోమ్ ఆశ చూపించి మధ్య తరగతి కుటుంబాల జీవితకాల పొదుపులను కొల్లగొట్టింది. తప్పుడు హామీలతో బయ్యర్లను ఆకట్టుకొని వారి నుంచి 81 శాతం ముందే డబ్బులు కట్టించి తీరా సమయానికి వారికి ఫ్లాట్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వారిని రోడ్డున పడేసింది. కోట్లాది రూపాయలు పెట్టిన బయ్యర్లంతా ఏకమై వాసవి గ్రూప్ నిర్వాహకుల మోసాలపై రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. నిర్వాహకులు ఎంతకు దిగి రాకపోవడంతో రెరా(తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ రెరా)ను ఆశ్రయించారు.

విచారణ చేపట్టిన రెరా వాసవి గ్రూప్ నిర్వాహకంపై గట్టి షాక్ ఇచ్చింది. ఆలస్యంతో పాటు కొనుగోలుదారులకు తప్పుడు హామీలు ఇచ్చిన వాసవి గ్రూప్‌పై రెరా ఆగ్రహం వ్యక్తం చేసింది. కొనుగోలుదారుల నుంచి 81 శాతం డబ్బులను ముందే తీసుకొని ఫ్లాట్లు సమయానికి ఇవ్వకపోవడం, కొనుగోలుదారులను తప్పుడు హామీలతో మభ్యపెట్టడం వంటి కారణాలతో చర్యలు తీసుకున్నది. కొనుగోలుదారుల నుంచి తీసుకున్న నగదుపై 10.85శాతం వడ్డీతో సహా చెల్లించాలని ఖరాఖండిగా చెప్పేసింది. ఒప్పందం ప్రకారం హ్యాండోవర్ చేస్తానన్న తేదీ 2024 మార్చి నుంచి తిరిగి వారికి హ్యాండోవర్ జరిగే వరకు చెల్లించాల్సిందేనని రెరా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**50కి పైగా ఫిర్యాదులు**

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వాసవి గ్రూప్‌పై గడిచిన ఏడాది కాలంగా కొనుగోలుదారులు తిరుగుబావుటా ఎగురవేశారు. డబ్బులు మొత్తం చెల్లించిన తర్వాత ఫ్లాట్లను అప్పగించకపోవడంతో ఆగ్రహానికి గురైన బాధితులంతా ఇటీవల బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ప్రధాన కార్యాలయంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మోసపూరితమైన కంపెనీ చేతిలో ఇరుక్కుపోయిన వందలాది మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయంటూ నిరసనలు తెలుపుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ లేక్ సిటీ ప్రాజెక్టుపై దాదాపు 50 మందికి పైగా రెరాలో ఫిర్యాదు (నంబరు 136 ఆఫ్ 2025) చేశారు. విచారణకు స్వీకరించిన రెరా కొనుగోలుదారుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా ఉందని గుర్తించింది.

ఈ నేపథ్యంలోనే కొవిడ్ 19 ప్రభావం, లిటిగేషన్ ఆలస్యాలు కారణమని వాసవి గ్రూప్ విచారణలో వాదించగా, రెరా ఆ వాదనలను సున్నితంగా తిరసరించింది. 2021 మార్చిలోనే కొనుగోలుదారులతో ఒప్పందం కుదుర్చుకున్నందున, కొవిడ్ పరిస్థితులు తెలిసే ఉన్నప్పటికీ సమయానికి ఫ్లాట్లు ఇస్తామని మోసపూరిత హామీలు ఇచ్చారని రెరా వ్యాఖ్యానించింది. ప్రాజెక్ట్‌ను తక్షణమే పూర్తి చేసి ఫ్లాట్లు ఇవ్వాలని ఆదేశించింది.

మళ్లీ ఆలస్యం చేస్తే రెరా చట్టం 63వ సెక్షన్ ప్రకారం భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించింది. వాసవి ప్రవర్తన వల్ల హోమ్ బయర్స్‌లో నమ్మకం దెబ్బతింటోందని, ఇకపై తప్పులు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని రెరా గట్టిగా హెచ్చరించింది. వాసవి లేక్ సిటీ ప్రాజెక్ట్‌లో పెట్టుబడులు పెట్టిన వందలాది కుటుంబాలకు ఈ ఉత్తర్వులు కొంత ఊరటనిస్తే, మరోవైపు ఫ్లాట్ కల ఇంకా ఎప్పుడెప్పుడు నెరవేరుతుందో అనేది ప్రశ్నగానే మిగిలింది.

### వాసవి సరోవర్‌పైనే హైడ్రా చర్యలు

వాసవి గ్రూప్ చేపడుతున్న ప్రాజెక్టుల్లో ఒక్కో చోట ఒక్కో రీతిలో అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. కాగితాల్లో చెప్పేదొకటి... క్షేత్రస్థాయిలోచేసేదొకటి అన్నట్లు అంతులేకుండా ఆక్రమాలకు పాల్పడుతున్నది. కొనుగోలుదారులే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టులను చేపడుతున్నది. హఫీజ్‌పేట లేక్ సిటీ వెస్ట్ ప్రాజెక్టులో కొనుగోలుదారులను మోసం చేస్తే కూకట్‌పల్లి ఖైత్లాపూర్‌లో వాసవీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణాలపై హైడ్రా సీరియస్‌గా వ్యవహరించింది.
భరత్‌నగర్‌ఖైత్లాపూర్ మార్గంలోని కాముని చెరువుమైసమ్మ చెరువులను కలుపుతూ సాగే వరద కాలువను కబ్జా చేసిన వాసవి నిర్మాణ సంస్థపై హైడ్రా కేసు నమోదు చేసింది. 17 మీటర్ల వెడల్పుతో పాటు ఇరువైపులా 9 మీటర్ల చొప్పున బఫర్ జోన్ వదలకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి అక్రమాలను గుర్తించారు. హైడ్రా సూచన మేరకు ఇరిగేషన్ శాఖ కూకట్‌పల్లి పీఎస్‌లో కేసు నమోదు చేసింది. కొంతమేర ఇరువైపులా రిటైనింగ్ వాల్స్‌తో నిర్మించిన కాలువ మధ్యలో స్లాబ్ వేసేందుకు ఉద్దేశించిన పిల్లర్లను కూడా తొలగించాలని నిర్ణయించారు.

### గట్టి షాక్‌నిచ్చిన రెరా

హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట మంజీరా పైపులైన్ రోడ్డులో లేక్ సిటీ వెస్ట్ పేరిట ప్రాజెక్ట్(రెరానంబరు P0 2500 001819) ను 2020లో అనుమతులు తీసుకున్నారు. సెల్లార్ +గ్రౌండ్ +14 ఫ్లోర్లతో ఏడు టవర్ల నిర్మాణం జరుగుతున్నది. ఇందులో 2, 3 బీహెచ్‌కే ఫ్లాట్‌లు ఉన్నాయి. తొలుత 2023 ఆగస్టు నాటికి ఫ్లాట్లు అందజేస్తామని వాసవి గ్రూప్ కొనుగోలుదారులతో ఒప్పందం కుదుర్చుకున్నది.
ఆరు నెలల గ్రేస్ పీరియడ్‌తో కలిపి గరిష్ఠంగా గతేడాది ఫిబ్రవరిలో హ్యాండోవర్ చేయాలని నిబంధన ఉంది. కానీ ఇప్పటికీ (సెప్టెంబర్ 2025) ప్రాజెక్ట్ 60 70% మాత్రమే పూర్తి కాగా, ఫ్లాట్ల హ్యాండోవర్ జరగలేదని రెరా గుర్తించింది. కొనుగోలుదారులు ఇప్పటికే ఫ్లాట్ ధరలో 81% వరకు చెల్లించినా వాసవి నిర్వాహకులు కేవలం తప్పుడు హామీలు, వాయిదా మాటలు మాత్రమే చెబుతూ వినియోగదారులను మోసగించినట్లుగా తేలింది. ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేయడం వల్ల కొనుగోలు చేసిన వారికి ఆర్థిక భారం, మానసిక ఒత్తిళ్లకు గురిచేసిన వాసవి తీరును సీరియస్‌గా తీసుకున్న రెరా.. కొనుగోలుదారుల నుంచి వసూలు చేసిన మొత్తంపై ప్రతి సంవత్సరం 10.85% వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది.

# ఖర్గే మాటలు చూస్తే నవ్వొస్తుంది..


మొదటిపేజీ తరువాయి

పిరాయింపుల పైన నిర్ణయం తీసుకోవడానికి గడువు ఉండదా అని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. యూరియా కృత్రిమ కొరతను కాంగ్రెస్ సృష్టించిందని, రాష్ట్రప్రభుత్వమే దీనికి కారణమని తెలంగాణ రైతులకు అర్థమైందని రామచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణకు అవసరమైన యూరియాను కేంద్రం ఎప్పుడో ఇచ్చిందని, కొద్దిగా ఆలస్యం కావొచ్చు కానీ కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో కుటుంబ తగాదాలు ఉన్నాయని, కానీ బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య తగాదా లేదని అన్నారు. ఓయూకి వెయ్యి కోట్లు ఇస్తానని సీఎం అన్నారని, కానీ ఇప్పుడు ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు కూడా రావడం లేదని ఆరోపించారు. పార్టీలో ఎవరిపైనా వివక్ష లేదని, ఇంకా 650 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన చెప్పారు. పార్టీ కమిటీలో అందరికీ అవకాశం రాలేదని,



వారి సేవలను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తామని అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొంటే, ఉన్న నలుగురు సభ్యులు కూడా ఉంటారో లేదో అనే భయంతోనే బీఆర్ఎస్ ఓటింగ్‌కు దూరంగా ఉందని ఎద్దేవా చేశారు

# జెన్‌కోకు జీఎస్టీ షాక్




మొదటిపేజీ తరువాయి

అనుమతి తీసుకోవాలి. ఆ తర్వాత పెరిగిన బొగ్గు విలువను వార్షిక ఆదాయ, అవసర నివేదికలో పొందుపరుస్తారు. దీన్ని ఈఆర్సీ ఆమోదించిన తర్వాత వచ్చే ఏడాది కొత్త టారిఫ్‌లలో విద్యుత్ బిల్లుల రూపంలో ప్రజలపై భారం పడే అవకాశం ఉంది.

**భారం రూ.300 కోట్లపైనే..!**

టీజీ జెన్‌కో ప్లాంట్లకు ఏడాదికి 29 మిలియన్ టన్నుల బొగ్గు అవసరం ఉంటుంది. అయితే, పవన, సౌర విద్యుత్‌తోపాటు, బహిరంగ మార్కెట్లో చౌకగా విద్యుత్ లభిస్తుండటంతో విద్యుత్ సంస్థలు వాటిని కొనుగోలు చేస్తున్నాయి. దీంతో జెన్‌కో ప్లాంట్లను బ్యాక్ డౌన్ చేస్తున్నారు. ఏడాది పొడవున గరిష్ఠంగా 65%ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) తో పనిచేస్తున్నాయి. దీంతో ఏటా 15 మిలియన్ టన్నుల వరకు బొగ్గు అవసరం ఉంటోంది. ప్రతి టన్ను బొగ్గును సింగరేణి నుంచి సగటున రూ.5 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

జీఎస్టీ పెరగడం వల్ల అదనంగా టన్నుకు రూ.630 చెల్లించాలి. 15 మిలియన్ టన్నులకు రూ.945 కోట్ల వరకు భారం పడుతుంది. అయితే, బొగ్గుపై కొంత రాయితీ ఇవ్వాలన్నది కేంద్రం నిర్ణయం. ఇది తీసివేసినా ఏడాదికి రూ.300 కోట్ల పైనే భారం పడొచ్చని అంచనా వేస్తున్నారు. పీపీఏలున్న ప్రైవేటు సంస్థలపై పడే జీఎస్టీ భారం మరో రూ.125 కోట్లు ఉండొచ్చని అంచనా. మొత్తంగా రూ.425 కోట్ల మేర భారం ఉండొచ్చని చెబుతున్నారు.

### ప్రజలకు ఇది భారమే

పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులపై జీఎస్టీని తగ్గించారు. కొత్తగా వచ్చే వాటికే ఇవి వర్తిస్తాయి. కాబట్టి ప్రస్తుతం ఎలాంటి ఉపయోగం లేదు. మరోవైపు థర్మల్ విద్యుత్ కేంద్రాలు వాడే బొగ్గుపై జీఎస్టీ పెంచారు. సెస్ తగ్గించినా జీఎస్టీ భారమే ఎక్కువ. ఈ భారం మొత్తం ప్రజలపైనే పడుతుంది. రాబోయే కాలంలో విద్యుత్ చార్జీలు పెరిగే అవకాశం ఉంటుంది.

**ఎం వేణుగోపాలరావు,**
**సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్**

### పరిస్థితిని సమీక్షిస్తున్నాం

జీఎస్టీ శ్లాబులు మారడం వల్ల బొగ్గుపై వ్యయం పెరుగుతుంది. ఇది జెన్‌కోకు ఏమేర భారం కలిగిస్తుందనేది పరిశీలిస్తున్నాం. అధికారికంగా శ్లాబులు అమలులోకి వచ్చిన తర్వాత పెరిగే భారాన్ని విద్యుత్ నియంత్రణ కమిటీకి వివరిస్తాం. కమిషన్ ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం.

**- హరీశ్, టీజీ జెన్‌కో సీఎండీ**



# దేశంలో అత్యధిక ఆస్తులు కల్గిన ప్రాంతీయ పార్టీగా బీఆర్ఎస్

- **2023-24 ఆర్థిక సంవత్సరానికి ఏడీఆర్ నివేదిక వెల్లడి**
- **రూ.685.51 కోట్ల ఆదాయంతో బీఆర్ఎస్‌కు అగ్రస్థానం**
- **టాప్-5లో చోటు దక్కించుకున్న టీడీపీ, వైసీపీ**
- **రెండో స్థానంలో టీఎంసీ, మూడో స్థానంలో బీజేడీ**
- **మొత్తం ఆదాయంలో 83 శాతం వాటా ఈ ఐదు పార్టీలదే**

**హైదరాబాద్ సెప్టెంబర్ 11(సిద్దిపేట పవర్):**

దేశంలోని ప్రాంతీయ పార్టీల ఆదాయంలో తెలుగు రాష్ట్రాల పార్టీలు సత్తా చాటాయి. 202324 ఆర్థిక సంవత్సరానికి గాను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం, తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ దేశంలోనే అత్యంతసంపన్నప్రాంతీయపార్టీగా మొదటి స్థానంలో నిలిచింది. ఈ జాబితాలోని తొలి ఐదు స్థానాల్లో మూడు తెలుగు పార్టీలు ఉండటం విశేషం.

ఏడీఆర్ నివేదిక వివరాల ప్రకారం, 2023 24లో బీఆర్ఎస్ రూ.685.51 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. ఆ తర్వాతి స్థానంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రూ.646.39 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఒడిశాకు చెందిన బిజూ జనతాదళ్ (బీజేడీ) రూ.297.81 కోట్లతో మూడో స్థానంలో ఉంది. ఇక, ఏపీకి చెందిన అధికార టీడీపీ రూ.285.07 కోట్లతో నాలుగో స్థానాన్ని, వైసీపీ రూ.191.04 కోట్లతో ఐదో స్థానాన్ని దక్కించుకున్నాయి.

దేశవ్యాప్తంగా దాదాపు 40 ప్రాంతీయ పార్టీలు ప్రకటించిన మొత్తం ఆదాయం రూ.2,532.09 కోట్లుగా ఉందని ఏడీఆర్ నివేదిక స్పష్టం చేసింది. అయితే, ఈ మొత్తం ఆదాయంలో సింహభాగం కేవలం ఐదు పార్టీలదే కావడం గమనార్హం. తొలి ఐదు స్థానాల్లో ఉన్న బీఆర్ఎస్, టీఎంసీ, బీజేడీ, టీడీపీ, వైసీపీల వాటానే ఏకంగా 83.17 శాతంగా నమోదైంది. మిగిలిన పార్టీలన్నీ కలిపి కేవలం 17 శాతం లోపే ఆదాయాన్ని కలిగి ఉన్నాయని ఈ నివేదిక గణాంకాలు తెలిపాయి.

# రైల్వే ప్రాజెక్టులపై ఫోకస్

మొదటిపేజీ తరువాయి

దక్షిణ మధ్య రైల్వే అధికారులతో పాటు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను ముఖ్యమంత్రి స్వాగతించారు. కొత్త ప్రాజెక్టులపై ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. సీఎంతో పాటు ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాసరాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్మెంట్తో పాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్మెంట్ను పరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలుమార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా కిలోమీటర్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని



ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేయటంతో హైదరాబాద్ మహానగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. వికారాబాద్ కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్తో పాటు వరంగల్ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.

# మహేశ్ బాబు వల్లే మా దశ తిరిగింది..

- **అసలు విషయం చెప్పిన అభిబస్ సీఈఓ**
- **మహేశ్ రాకముందు రోజుకు 3 వేల టికెట్ల అమ్మకాలు మాత్రమే**
- **ఆయన చేరాక రోజుకు 20 వేల టికెట్లకు పెరిగిన విక్రయాలు**
- **మా బ్రాండ్ విలువను పెంచింది మహేశేనని ప్రశంస**

**హైదరాబాద్ సెప్టెంబర్ 11(సిద్దిపేట పవర్):**

సూపర్ స్టార్ మహేశ్ బాబు సినిమాల్లోనే కాదు, బ్రాండ్ ప్రచారంలోనూ తనకున్న అసాధారణమైన క్రేజ్‌ను మరోసారి నిరూపించుకున్నారు. ఆయన ఒక సంస్థకు ప్రచారకర్తగా వ్యవహరిస్తే, ఆ సంస్థ వ్యాపారం ఏ స్థాయిలో వృద్ధి చెందుతుందో ప్రముఖ ఆన్‌లైన్ బస్ టికెటింగ్ యాప్ 'అభిబస్' సీఈఓ సుధాకర్ రెడ్డి స్వయంగా వెల్లడించారు. మహేశ్ తమ బ్రాండ్‌తో కలిశాక అమ్మకాలు ఊహించని రీతిలో పెరిగాయని ఆయన పేర్కొన్నారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, మహేశ్ బాబు తమ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా చేరకముందు తమ వ్యాపార పరిస్థితిని వివరించారు. "మహేశ్ బాబు మా బ్రాండ్‌తో కలవక ముందు, మేము రోజుకు కేవలం 3,000 టికెట్లు మాత్రమే అమ్మేవాళ్లం. ఆయన ప్రచారకర్తగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, ఇప్పుడు మా రోజువారీ టికెట్ల అమ్మకాలు 20,000 మార్కును దాటాయి. మా బ్రాండ్ విలువను అమాంతం పెంచిన ఘనత పూర్తిగా మహేశ్ బాబుదే" అంటూ ఆయనపై ప్రశంసలు కురిపించారు.

చాలా ఏళ్ల క్రితమే అభిబస్‌కు ప్రచారకర్తగా మారిన మహేశ్ బాబు, ఇప్పటికీ అదే సంస్థతో కొనసాగుతున్నారు. ఇది ఆయనపై ఆ సంస్థకు ఉన్న నమ్మకాన్ని, ఆయన బ్రాండ్ ఇమేజ్‌కు ఉన్న స్థిరత్వాన్ని స్పష్టం చేస్తోంది.

ఇక సినిమాల విషయానికొస్తే, మహేశ్ బాబు ప్రస్తుతం దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో నటిస్తున్నారు. పాన్‌వరల్డ్ స్థాయిలో భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాతో మహేశ్ కెరీర్ మరో స్థాయికి చేరడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# జూబ్లీహిల్స్‌లో పార్టీల ఎత్తుకు పై ఎత్తు..

మొదటిపేజీ తరువాయి

చూస్తోంది. ఇక కాంగ్రెస్, బీఆర్ఎస్ ను ప్రజలు నమ్మడం లేదని ఈ సారి తమకు అవకాశం ఇవ్వాలని బీజేపీ వ్యూహరచన చేస్తోంది. ఈక్రమంలో ప్రధాన పార్టీల మధ్య ఎత్తుకు పై ఎత్తులతో జూబ్లీహిల్స్ రాజకీయం రసవత్తరంగా మారగా ఇప్పుడు అభ్యర్థుల ఎంపిక విషయంలో తుది కసరత్తు స్టేట్ పాలిటిక్స్ లో మరింత ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తోంది.

**రేవంత్ వ్యూహం ఏంటి?:**

జూబ్లీహిల్స్ బై పోల్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే క్షేత్ర స్థాయిలో పని మొదలు పెట్టింది. బీఆర్ఎస్ (BRS) అభ్యర్థిగా మాగంటి సునీత పేరునే దాదాపు ప్రకటించే అవకాశాలు ఉండటంతో రేవంత్ రెడ్డి ఆమెకు పోటీగా ఎవరిని రంగంలోకి దించబోతున్నారనే చర్చ జోరుగా జరుగుతోంది. అధికార పార్టీ కావడంతో టికెట్ దక్కితే గెలుపు దాదాపు ఖాయం అనే ధీమా కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తోంది. దీంతో టికెట్ కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. అయితే ఈ రేస్ లో ముందు వరుసలో ఉన్న అజారుద్దీన్ కు ఎమ్మెల్సీ పోస్టు ఇచ్చి ఆయనను సైడ్ చేసింది అధిష్టానం. దీంతో టికెట్ ఆశిస్తున్న వారిలో రోహిన్ రెడ్డి, నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్ తో పాటు మరికొంత మంది పేర్లు రేస్ లో వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఊహించని విధంగా కొత్త మొహాలు తెరపైకి వస్తున్నాయి. తనకు టికెట్ ఇవ్వాలని తాజాగా మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ స్వరం పెంచుతున్నారు. ఈ క్రమంలో ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ఎలాంటి వ్యూహంతో రాబోతున్నారు అనేది మరింత




ఉత్కంఠ రేపుతోంది.

**కూటమి యోచనలో బీజేపీ?:**

జూబ్లీహిల్స్ బై పోల్ లో తమ సత్తా చాటేందుకు బీజేపీ సైతం ప్రణాళికలు వేసుకుంటోంది. ఇక్కడ సెటిలర్ల ఓటర్లు కూడా భారీ సంఖ్యలో ఉండటంతో ఏపీ తరహా ఇక్కడ కూటమి తరహా ప్రయోగం ఏమైనా చేయబోతున్నారా అనేది సందేహంగా మారింది. ఇక్కడ ఇప్పటికే పలువురు అభ్యర్థుల పేర్లు పరిశీలిస్తున్న కమలం పార్టీ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కూతురు విజయారెడ్డిని బరిలోకి దింపే ఆలోచనతోనూ ఉందనే ప్రచారం జరుగుతోంది.

**బీఆర్ఎస్ కు కవిత టెన్షన్?:**

జూబ్లీహిల్స్ బై పోల్ లో ప్రధాన పార్టీల వ్యూహాలు ఒక ఎత్తైతే ఎమ్మెల్సీ కవిత అంశం మరో ఎత్తు అనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన కవిత ఇక్కడ నేరుగా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఒక వేళ పోటీ చేయకపోయినా పరోక్షంగా మద్దతు తెలిపినా అది బీఆర్ఎస్ కు పెద్ద మైనస్ అయ్యే అవకాశాలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. అయితే ప్రధాన పార్టీలలో టికెట్ లభించని ఆశావహులు కవిత అండతో పోటీ చేయబోతున్నారనే టాక్ నియోజకవర్గంలో గుప్పుమంటోంది.

## కేటీఆర్‌కు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారం

మొదటిపేజీ తరువాయి



కృషి చేశారంటూ, ఆయనను 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఎంపిక చేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఘనంగా జరగనుంది. ఈ నెల సెప్టెంబర్ 24వ తేదీన అక్కడ నిర్వహించనున్న 9వ 'ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్' వేదికగా కేటీఆర్‌కు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. పర్యావరణ పరిరక్షణ, హరిత విధానాల అమలులో కేటీఆర్ గతంలో మంత్రిగా ఉన్నప్పుడు చొరవ చూపారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పురస్కారం కేటీఆర్‌కు వ్యక్తిగతంగానే కాకుండా, తెలంగాణలో పర్యావరణ పరిరక్షణకు జరిగిన ప్రయత్నాలకు లభించిన అంతర్జాతీయ గుర్తింపుగా పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## జర్నలిస్టులను తిట్టిన బెదిరించిన 50,000 వేల జరిమానా మరియు ఐదేళ్లు కఠిన కారాగార శిక్ష

- **అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు...**



దేశంలోని వర్కింగ్ జర్నలిస్టులు. పాత్రికేయులను బెదిరించిన. తిట్టిన లేదా కొట్టిన. 50, వేల జరిమానా మరియు ఐదేళ్లు కఠిన కారాగార శిక్షకు వారు అర్హులవుతారని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు గురువారం ఓ కేసు విచారణ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ తీర్పుతో పలువురు జర్నలిస్టులు. తమ వృత్తిపరంగా ఎలాంటి భయాందోళనకు గురికా కుండా నిర్భయంగా ప్రజలకు వాస్తవ సమాచారం అందించే అవకాశం ఉంటుందని పలు జర్నలిస్టు సంఘాల నేతలు. సీనియర్ జర్నలిస్టులు ఈతీర్పును ఆహ్వానించారు.... అలాగే రాజకీయ నాయకుల నుండి ఒక్కింత రక్షణగా సుప్రీంకోర్టు వారి ఈతీర్పు. ఉంటుందని సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు...

# రోడ్డెక్కిన రైతన్న..!

**చేర్యాల, సెప్టెంబర్ 11 (సిద్దిపేట పవర్)**

చేర్యాల పట్టణంలో స్థానిక APGVB బ్యాంకు దగ్గర రాజీవ్ రహదారి మీద రైతులందరూ కలిసి రాస్తారోకో నిర్వహించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా యూరియా కోసం మేము అవస్తలు పడుతున్నాము అని, మమ్మల్ని పట్టించుకునే నాధుడే లేడు అని వాపోయారు.. వారు రహదారి పై కూర్చొని నిరసన వ్యక్తం చేయడంతో వాహనాలు ఆగిపోయాయి, వారికి పోలీసులు వచ్చి నచ్చచెప్పడం తో ఆందోళన విరమించారు..ఇప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించి వారికి యూరియా అందించాలని రైతులు వేడుకుంటున్నారు..



## ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 11 ( సిద్దిపేట పవర్ ) :**

నార్త్ జోన్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు,సిబ్బంది,వారి కుటుంబసభ్యులకు గురువారం సికింద్రాబాద్ తిరుమలగిరి లోని సిటీ న్యూరో సెంటర్ లో ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. మెడికల్ క్యాంపును ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ప్రారంభించారు. ఈసందర్భంగా దాదాపు 300 మంది పోలీస్ సిబ్బంది, వారి ఫ్యామిలీ మెంబర్స్ కు బీపీ, ఈసీజీ,ఆర్బీఎస్,సీరం క్రియాటినిన్,హిమొగ్లోబిన్,ప్లేట్ లెట్ కౌంట్, తదితర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ...ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కష్టపడే ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్య సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కఠిన మైన విధుల్లో నిమగ్నమై ఉండటం వలన సాధారణ వ్యాయమానికి కూడ సమయం దొరకకపోవడం గుర్తించామన్నారు. ప్రతి ఏడు కనీసం ఒకసారి సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం అవసరమన్నారు. నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు,ఇన్స్పెక్టర్ మధుబాబు, తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




## గాంధీ ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ గా డా.వాణి

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 11 ( సిద్దిపేట పవర్ ):**



సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ గా అడిషనల్ డీఎంఈ ప్రొఫెసర్ డా.వాణి ని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆమె శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంతవరకు సూపరింటెండెంట్ గా వ్యవహరించిన డాక్టర్ రాజకుమారి గాంధీ మెడికల్ కాలేజీ ఫిజియాలజీ ప్రొఫెసర్ గా వ్యవహరిస్తారని అధికారులు తెలిపారు. గాంధీ పాలన వ్యవహారాల్లో ఆరోపణలు,విమర్శలు రావడంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.

# ప్రతి పేద ఇంటికి ఇందిరమ్మ ఇళ్లు

- **విడతల వారీగా అర్హులందరికీ ఇండ్లు ఇస్తాం**
- **కాంగ్రెస్ నాయకుడు అజ్జు యాదవ్ హామీ**



సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చెర్లఅంకిరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి ముగ్గు పోశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు అజ్జు యాదవ్ మాట్లాడుతూ ప్రతి పేద ఇంటికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని విడతలవారీగా అర్హులందరికీ ఇండ్లు ఇస్తామని హామీనిచ్చారు.ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుడికి ఐదు లక్షలు రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు.పనులు ప్రారంభించిన లబ్ధిదారులకు మొదటి విడత బిల్లులు పడ్డాయని గుర్తు చేశారు.గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్రం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చేపడుతుందన్నారు. ఎన్నికల ముందు మండల అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు.మంజూరి పత్రాలు స్వీకరించిన లబ్ధిదారులు త్వరగా ఇళ్ళను నిర్మించుకోవాలని కోరారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 రూపాయలకే



## వివాహేతర సంబంధంతో భర్త హత్యయత్నానికి పాల్పడిన భార్య

- **హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్**
- **స్థానిక ఎస్సై జే. కృష్ణా రెడ్డి**

**సిద్ధిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**జగదేవపూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో 15 రోజుల క్రితం తన పైన వడ్డే బాబు అనే వ్యక్తి తన ఇంట్లోకి చొరబడి కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడని తీగుల బాలచంద్రం అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జగదేవపూర్ పోలీసులు.ఈ విషయంలో విచారణ చేపట్టిన పోలీసులు వడ్డే బాబును పట్టుకొని విచారించగా కీలక విషయాలు చెప్పినాడు. బాబుకు, బాల్ చంద్రం భార్య అయిన మమతకు గత సంవత్సర కాలంగా వివాహేతర బంధం ఉందని ఈ సంబంధం గురించి తెలిసిన బాల్ చంద్రం, మమత యొక్క సోదరులైన మహేష్, లక్ష్మణులు రెండుసార్లు బాబును, మమతను మందలించారు. దాంతో వీరు ఇరువురికి కలుసుకోవడం కష్టం కావడంతో బాల్ చంద్రాన్ని చంపివేస్తేనే తాము స్వేచ్ఛగా తిరగవచ్చు అన్న ఆలోచన తో గత ఆగస్టు నెల 24వ తారీఖు నాడు రాత్రి పూట బాల్ చంద్రం పడుకున్న తర్వాత మమత బాబుకి ఫోన్ చేసి నేను ఇంటి యొక్క తలుపు తీశాను నువ్వు వచ్చి చంపెయ్ అని చెప్పగా బాబు ఐరన్ రాడు, కూరగాయలు కోసే కత్తిని తీసుకుని వెళ్లి బాల్ చంద్రం మేడ వీపు చేతి తలపైన గాయాలు చేసినాడు. చనిపోయాడు అనుకుని వెంటనే అక్కడి నుండి పారిపోయాడు. బాబు కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు గురువారం పట్టుకొని విచారించగా మమతనే తన భర్తను చంపమని ప్రోత్సహించింది అని తెలుపగా మమతను కూడా అదుపులోకి తీసుకొని ఇరువురిని జ్యూడిషియల్ రిమాండ్ నిమిత్తం గజ్వేల్ కోర్టులో హాజరు పరిచిన జగదేవపూర్ పోలీసులు. మమతకు ముగ్గురు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు.

## దక్షిణాసియా యువకుడికి అరుదైన గౌరవం

- **హానరరీ ఎఫ్ఆర్సీఎస్ (గ్లాస్గో) పొందిన తొలి శస్త్రవైద్యుడు**




**సికింద్రాబాద్, సెప్టెంబర్ 11 ( సిద్దిపేట పవర్ ):** కిమ్స్ ఉషాలక్ష్మి బ్రెస్ట్ డిసీజెస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రఘురామ్ పిల్లరిశెట్టి మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. 425 ఏళ్ల చరిత్ర కలిగిన గ్లాస్గో రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్ వారు ఆయన్ని హానరరీ ఎఫ్ఆర్సీఎస్ (గ్లాస్గో) తో సత్కరించారు. ఈ గౌరవం పొందిన దక్షిణాసియాలోని అతి పిన్న వయస్కుడిగా ఆయన గుర్తింపు పొందారు. గ్లాస్గోలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కాలేజ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ హనీ ఎటీబా ఈ ఫెలోషిప్‌ను అందించారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన, చికిత్సలో డాక్టర్ రఘురామ్ చేసిన కృషి అసాధారణం అని ఆయన అభినందించారు. 1997లో ఇదే కాలేజ్ నుంచి ఎఫ్ఆర్సీఎస్ పరీక్షలో ఉత్తీర్ణులైన రఘురామ్, ఇప్పుడు హానరరీ ఫెలోషిప్‌తో ప్రపంచంలోనే ఏకైక ప్రత్యేక గుర్తింపు పొందిన వైద్యుడిగా నిలిచారు. ఆయనకు పద్మశ్రీ, డాక్టర్ బి.సి. రాయ్ అవార్డు, బ్రిటన్ ప్రభుత్వం ప్రదానం చేసిన ఓబీఈ సహా పలు అంతర్జాతీయ గౌరవాలు లభించాయి. దేశవ్యాప్తంగా రొమ్ము క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన రఘురామ్, దక్షిణాసియాలోనే తొలి సమగ్ర బ్రెస్ట్ హెల్త్ సెంటర్ స్థాపనలో ముందుండారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో స్క్రీనింగ్ కార్యక్రమాలు చేపట్టి, వేలాది మహిళలకు సేవలందించారు.

## సికింద్రాబాద్‌లో అంతర్రాష్ట్ర గంజాయి రవాణా ముఠా అరెస్ట్

- **రూ.8.47 లక్షల విలువ చేసే 16.95 కిలోల డ్రై గంజాయి స్వాధీనం**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 11 ( సిద్దిపేట పవర్ ) :** సికింద్రాబాద్ రైల్వే పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఇద్దరు నిందితుల నుంచి రూ 8.47 లక్షల విలువ చేసే 16.95 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ డీఎస్పీ జావేద్,ఇన్స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్ లు తెలిపిన వివరాలు... ఢిల్లీకి చెందిన చంద్రప్రకాశ్(22)కోల్కతా కు చెందిన జమీలా ఖతూన్ (19) అనే ఇద్దరు స్నేహితులు. వీరు గంజాయిని రవాణా చేస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరు ఫేస్ బుక్ ద్వారా పరిచయమైన పరాన్ ఖాన్ నుంచి గంజాయి కొనుగోలు చేసేవారు. కిలో గంజాయిని రూ 1200 కొనుగోలు చేసి ఢిల్లీలో చిన్న పాకెట్లుగా అమ్మితే నాలుగురేట్లు లాభం వస్తుందని ఆలోచించారు. ఇందుకు కావాల్సిన రూ 20వేలలో చేరిసగం పెట్టుబడిగా పెట్టారు. ఇద్దరు కలిసి యూపీఐ ద్వారా డబ్బులు పంపి, 16 కిలోల గంజాయిని బుక్ చేశారు. సెప్టెంబర్ 10న ఢిల్లీ నుంచి విజయనగరం వెళ్ళి గంజాయి తీసుకొచ్చి, విశాఖ ఎక్స్ ప్రెస్ లో సికింద్రాబాద్ కు చేరుకున్నారు. తర్వాత ఢిల్లీ వెళ్ళాలను కున్నారు. సెప్టెంబర్ 11 న ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్కు చేరుకొని, ఢిల్లీకి వెళ్ళే రైలు కోసం ఎదురు చూస్తూ వెయిటింగ్ హాల్ లో గంజాయి సంచులతో ఉండగా, ఉదయం వారిని రైల్వే పోలీసులు గుర్తించి, పట్టుకున్నారు. ఈ ఆపరేషన్ లో ఇన్స్పెక్టర్ సాయిఈశ్వర్ గౌడ్,ఎస్ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. రైల్వే ఎస్పీ చందనాదీప్తి,డీఎస్పీ జావేద్ లు వీరిని అభినందించి , రివార్డులను ప్రకటించారు.





## పెన్షన్ దారుల సమస్యలపై ఈనెల 15న దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ ఏర్పాటు చెయ్యాలి

- **ఎంపీడీవో ఆఫీస్ లో ఎమ్మార్పీఎస్ విహెచ్పిఎస్ నాయకుల వినతి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** వికలాంగులు వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు,బీడీ కార్మికులు చేతివృత్తుదారుల మరియు ఆసరా పింఛన్దారుల పింఛన్లు పెంచాలని ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తహసిల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో భాగంగా జగదేవపూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పోసాన్ పల్లి రాజు వి హెచ్ పి ఎస్ మండల అధ్యక్షులు దేవదానం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను మరిచి వికలాంగులను చేయూత పింఛన్దారులను మోసం చేస్తుందని అన్నారు. మా ప్రభుత్వం రాగానే మొదటి నెల నుంచి 4016 ఉన్న వికలాంగుల పింఛను 6016 ఇస్తామని చేయూత పింఛన్లు అన్నిటిని 2016 నుండి 4016 కీ ఇస్తామని చెప్పి ఇప్పటికీ 20 నెలలు గడుస్తున్న పెన్షన్ పెంచలేదని వాపోయారు గత రెండు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ ధరలు అనేక పోరాటాలు సభలు చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరు వచ్చినట్లుగా వ్యవహరిస్తుందని అన్నారు. అందుకని ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మండల కేంద్రాల్లో ఉన్న తహశీల్దార్ కార్యాలయం ముట్టడిని చేపట్టాం అందులో భాగంగానే జగదేవపూర్ మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని పెద్ద ఎత్తున ముట్టడిస్తామని హెచ్చరించారు. అదే రోజు సోమవారం కాబట్టి గ్రీవెన్స్ డే ఉంటుంది కాబట్టి ఎంపీడీవో ఆఫీసులో వికలాంగుల వితంతువుల చేయూత పింఛన్దారుల అన్ని సమస్యల పైన దరఖాస్తులను స్వీకరించడానికి ఒక ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఈరోజు ఎంపీడీవో ఆఫీస్ లో ఎమ్మార్పీఎస్ వి హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మండలంలో ఉన్న అన్ని గ్రామాల నుండి వికలాంగులు వృద్ధులు వితంతువులు బీడీ కార్మికులు చేతివృత్తుల కార్మికులు పెన్షన్లు తీసుకునే ప్రతి ఒక్కరు కొత్తగా పెన్షన్ల అప్లై చేసుకునే వారు అందరూ 15వ తేదీన జరిగే జగదేవపూర్ తహసిల్దార్ కార్యాలయం ముట్టడిని పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వి హెచ్ పి ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుండ్రు ఉప్పలయ్య నిర్మల్ నగర్ గ్రామ అధ్యక్షుడు కర్రి అశోక్ గోపాల్ పూర్ గ్రామ అధ్యక్షుడు మాసపాక మహేందర్ ఎమ్మార్పీఎస్ నాయకులు పోసానిపల్లి సాయిలు సుధాకర్ విహెచ్పిఎస్ నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**చేర్యాల, సెప్టెంబర్ 11 (సిద్దిపేట పవర్)** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుని గా ఎన్నికైన మరాఠి సంతోష్ గారు అదేవిధంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైన చదరపల్లి నరేష్ లను అభినందిస్తూ, అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కర్రోళ్ల అన్నమ్మ దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మరియు కర్రోళ్ల నవజీవన్ మాదిగ జర్నలిస్టుల ఫోరం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు తమ స్వగృహము నందు సన్మానించడం జరిగింది. వీరు ఈ సందర్భంగా మాట్లాడుతూ వీరు మన జాతికి గర్వకారణం అని, మన సామాజిక వర్గం లో వీరిని ఆదర్శంగా తీసుకోవాలి అని తెలిపారు..ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ మిత్రులు కర్రోళ్ల విజయ్ కుమార్ పాల్గొన్నారు.



## గాంధీలో అందుబాటులోకి నూతన ఎమర్జెన్సీ ఎక్స్ రే సెంటర్

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 11 ( సిద్దిపేట పవర్ ) :**

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఓపి విభాగం సెంట్రల్ లాబ్ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఎక్స్ రే సెంటర్ ను గురువారం అడిషనల్ డీఎంఈ డాక్టర్ ఎన్.వాణీ, సూపరింటెండెంట్ డా. రాజకుమారి లు సంయుక్తంగా ప్రారంభించారు. టీజీఎంఎస్ఐడీసీ ద్వారా కొనుగోలు చేసిన ఈ ఆధునిక ఎక్స్ రే యంత్రాల ద్వారా తక్కువ సమయం, తక్కువ విద్యుత్ వినియోగంతో అత్యవసర వేళల్లో వేగంగా ఫలితాలు వస్తాయని వారు పేర్కొన్నారు. ఎమర్జెన్సీ పేషెంట్లకు ఈ ఎక్స్ రే సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గాంధీ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి శేఖర రావు, ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి, డాక్టర్ రజని, రేడియాలజీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రేపు బైరాన్ పల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాలు

- అమరవీరులకు నివాళులర్పించనున్న సీపీఐ నాయకులు
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్




**సిద్దిపేట పవర్ మద్దూరు సెప్టెంబర్11**

తెలంగాణ సాయుధ పోరాట 77వ వార్షికోత్సవాలలో భాగంగా రేపు శుక్రవారం ఉదయం 11:00 గంటలకు ఉమ్మడి మద్దూరు మండలంలోని వీర బైరాన్ పల్లిలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించనున్నట్లు సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మంద పవన్, జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కనుకుంట్ల శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు హాజరుకానున్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి తుపాకీ తూటాలకు అమరులైన అమరవీరులకు స్తూపం, బురుజు వద్ద ఘనంగా నివాళులర్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం..!

- మద్యం మీద ఉన్న సోయి రైతులపై లేదు

**సిద్ధిపేట పవర్ , దుబ్బాక, సెప్టెంబర్ 11:** రైతులకు సరైన సమయంలో అందించే యూరియా విషయం లో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ విఫలమయ్యాయని బీఆర్ఎస్, కెపిఆర్ సేన నాయకుడు తుక్కయ్య గారి బాల్ రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వాలకు మద్యం మీద ఉన్న ధ్యాస రైతాంగానికి ఉపయోగపడే యూరియాను అందించడంలో సోయి లేదని విమర్శించారు. రైతులకు యూరియా సమయానికి అందించక పోవడం వలన ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ విషయంన్ని వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియ ప్రతి గ్రామానికి తగినంత అందించే విధంగా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. మందు షాపుల కాడ ఎలాంటి లైన్లు ఉండవు... కానీ అదే యూరియా కోసం రాత్రింబవళ్ళు రైతులు క్యూ లైన్లు కట్టి మండల కేంద్రాల్లో పడుకోవలసిన సమయం వచ్చిందన్నారు. యూరియా లేకుంటే ఇప్పుడు వేసిన పంటలకు నష్ట పరిహారం కింద తగిన ఆర్థిక సహాయాన్ని వారికి అందించాలన్నారు. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం జరిగిన రైతులకు వెంటనే నష్టపహారిహారం చెల్లించాలని అన్నారు. అంతే కాకుండా ఇల్లు కూలిపోయిన వారిని ప్రభుత్వమే



ఆదుకోవాలని అన్నారు.

## ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరణ

**సిద్దిపేట పవర్ నంగునూరు, సెప్టెంబర్ 11 :**

సిద్దిపేట జిల్లా ఫోటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నంగునూరులో గురువారం ఎక్స్పో గోడ పత్రికను ఆవిష్కరించారు. మండల తహసీల్దారు కార్యాలయంలో కార్యక్రమంలో తహసీల్దార్ సరిత ఈ గోడ పత్రికను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫోటో టెక్ & ఎడిట్ పాయింట్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20, 21 తేదీలలో హైదరాబాద్‌లోని నార్సింగిలోని"ఓం కన్వెన్షన్ హాల్" భారీ స్థాయిలో ఫోటో ట్రేడ్ ఎక్సపో 2025ను నిర్వహిస్తున్నట్లు ఫోటో వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ముష్కీర్ పరుశరాములు తెలిపారు. ఫోటోగ్రఫీ రంగం నిరంతరం అభివృద్ధి చెందుతూ, కొత్త సాంకేతికతలతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఫోటో ట్రేడ్ ఎక్స్ పోలో అత్యాధునిక కెమెరాలు, లైటింగ్ పరికరాలు, ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్‌లు, ప్రింటింగ్ టెక్నాలజీలు ప్రదర్శనకు రానున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఫోటోగ్రాఫర్ల కోసం వర్క్‌షాప్‌లు, సాంకేతిక సెషన్‌లు, ప్రత్యేక డెమోలు కూడా ఈ ఎక్సపోలో ముఖ్య ఆకర్షణలుగా ఉంటాయన్నారు. చిన్న స్టూడియో యజమానుల నుండి ప్రొఫెషనల్ వీడియోగ్రాఫర్ల వరకు అందరికీ ఈ వేదిక ఎంతో ఉపయోగకరంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఫోటో రంగం అభివృద్ధికి తోడ్పడే ఈ ఎక్స్ పోలో ఫోటో విడియే గ్రాఫర్లు తప్పనిసరిగా పాల్గొని లాభం పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి సందబోయిన రమేశ్, బాలకిషన్, అఖిల్, రాకేశ్, ఆర్ఐలు లింగం, సూర్య తదితరులు పాల్గొన్నారు.



### నూతన ఎంపీడీవోను కలిసి శాలువాతో సత్కరించిన ఆరుట్ల లింగం

**జనం తోడు చేర్యాల సెప్టెంబర్11**
సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కొత్తగా వచ్చిన ఎంపీడీవో శ్రీనివాస్ ను కలిసి సన్మానం చేశారు. మన గ్రామంలో అనేక సమస్యల గురించి వివరించారు. సానుకూలంగా స్పందించి వెంటనే అభివృద్ధికి బాటలు వేస్తానని హామీ ఇచ్చారు.




## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మెదక్ఎంపీ రఘునందన్ రావు

**కౌడిపల్లి సిద్దిపేట పవర్ ప్రతినిధి:-**

మండల పరిధిలోని ముత్రాజ్ పల్లి గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటన జరిగిన కుటుంబాన్ని గురువారం MP రఘునందన్ రావ్ పరామర్శించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తో HP గ్యాస్ అధికారి మధుసూదన్ తో మాట్లాడి తొందరగా నష్టపరిహారం చెల్లించాలని, ఇల్లు మంజూరు చెయ్యాలని అన్నారు. అంతేకాకుండా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్, మండల అధ్యక్షుడు



రాకేష్, బిజెపి నాయకులు బాల రాజ్, నరేష్, సాయి, అనిరుద్, నందు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు చొరవ తో సిద్ధిపేట లో జాబ్ మేళా

- ఈ నెల 13న సిద్దిపేట విపంచి కళా నిలయం లో
- జాబ్ మేళా కరపత్రాన్ని ఆవిష్కరించిన నాయకులు, నిర్వహకులు..




**సిద్ది పేట పవర్ సిద్ది పేట సెప్టెంబర్ 11 :** ఉన్నత చదువులు చదివి ఉద్యోగం లభించక ఖాళీగా ఉంటున్నారా.. అయితే ఇది మీ కోసమే. ఈనెల 13వ తేదీన సిద్ది పేటలో నిర్వహించే మెగా జాబ్ మేళాకు తరలిరండి. మీ కలలను సాకారం చేసుకోండి. నిరుద్యోగ యువత కోసం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు కృషితో ఇక్కడ జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరుగుతున్నదని పార్టీ పట్టణ అధ్యక్షులు సంపత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల సాయి రాం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలనీ. మీ చదువుకు సార్థకత చేకూరాలన్నా.. మీ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరాలన్నా.. బంగారు భవిష్యత్తు వైపు మీ అడుగులు పడాలన్నా ఈ జాబ్ మేళా వైపు అడుగేయండంటూ యువతకు పిలుపునిచ్చారు.. ఒక్క అడుగు బయటకు పెట్టండి.. మీ జీవిత ఆశయాన్ని సాదించండి.. ఎంత సేపు సిద్ది పేట లోనే ఉండి ఉద్యోగం చేస్తూ ఇక్కడే ఉంటా అనే మీ ఆలోచన నుండి బయట కు రావాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు సిద్ది పేట నియోజకవర్గ నిరుద్యోగ యువతి యువకుల కోసం జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నారని.. ఉద్యోగం చిన్నదా పెద్దదా అని కాకుండా ఎదో ఒక ఉద్యోగం చేస్తా కావాలి అనే తపన ఉండాలనే ఉద్దేశ్యం తో సిద్దిపేట లో ఈ నెల 13 న మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 10th క్లాస్ నుండి ఇంజనీర్ చదివిన యువతి యువకులకు మంచి అవకాశాలు రానున్నాయనీ.. ఈ జాబ్ మేళా లో 20 కంపెనీ లు 40 మంది హెచ్ ఆర్ లు పాల్గొంటారని తెలిపారు ఆసక్తిగలవారు ఈ కరపత్రం లోని క్యూ ఆర్ కోడ్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు ఇంజనీరింగ్ విద్యార్థుల కు టెక్ మహేంద్ర, టి సి ఎస్, ఇన్ఫోసిస్ కంపెనీ లు, ఐ టి ఐ వాళ్లకు ఎం ఆర్ ఎఫ్ కంపెనీ జాబ్ మేళా కు వచ్చే యువత నాలుగు సెట్స్ బయోడేటా తీసుకరావాలనీ తెలిపారు

**వేదిక :** విపంచి కళానిలయం, బై పాస్ రోడ్డు సిద్ది పేట..

**సమయం :** 9am to 5pm..

**అర్హతలు** బి టెక్ ( ECE, EEE ) గ్రాడ్యుయేషన్ (Any Degree ) ఎం. బి. ఎ, ఎం, సి. ఎ ఎం.మ్ ఫార్మసి, ఎం టెక్ ఐ టి ఐ (electric, fitter ) ఇంటర్, పదవ తరగతి..

**కంపెనీ లు** Tech Mahendra, Infosys, TCS, GMR,MRF, Welspun, SIREP, first source, H1,Teleperformance, big basket, Zepto, Dmart, Delhivery, Paytm, excellerate Global Solutions తదితరకంపెనీ లు పాల్గొంటారు.. ఇట్టి అవకాశాన్ని సిద్ది పేట నియోజకవర్గ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు





## సీసీ కెమెరాల నిఘా నీడలో దుద్దెడ

**సిద్దిపేట పవర్, సిద్దిపేట అర్బన్:**

సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుద్దెడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ప్రారంభించారు. నేరాలను నియంత్రించడంలో, నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల కీలక పాత్ర వహిస్తాయి. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు. నేరరహిత సమాజానికి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం. ప్రజలకు భద్రత, సెన్సాఫ్ ఆఫ్ సెక్యూరిటీ కలిగించడంలో సీసీ కెమెరాలు చాలా ముఖ్యం. నేరాలను నియంత్రించడంలో మరియు నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయి. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామస్తులకు గ్రామ పెద్దలకు, వ్యాపారస్తులను ప్రజా ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ దుద్దెడ గ్రామంలో రాజీవ్ రహదారి ఎంట్రీ, ఎగ్జిట్, గ్రామంలోని ముఖ్యమైన చౌరస్తాలలో 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేరాలను నియంత్రించడంలో నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల కీలక పాత్ర వహిస్తాయి, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు, నేరరహిత సమాజానికి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం, ప్రజలకు భద్రత, సెన్సాఫ్ ఆఫ్ సెక్యూరిటీ కలిగించడంలో సీసీ కెమెరాలు చాలా ముఖ్యం, నేరాలను నియంత్రించడంలో, నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయి, సీసీ కెమెరాలు 24 గంటల నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. జిల్లాలో నేరాల అదుపు చేయడానికి పోలీసులతో పాటు గ్రామ పెద్దలు గ్రామ ప్రజా ప్రతినిధులు వ్యాపారస్తులు భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నేరస్తుడు నేరం చెయ్యలేను అని చెప్పినా సీసీ కెమెరాలు చూపించి నచోతను చేసిన నేరాన్ని ఒప్పుకోవడం జరుగుతుందన్నారు. సీసీ కెమెరాలు ఉన్న ఇండ్లలో కాలనీలలో గ్రామాలలో నేరస్తులు నేరం చేయడానికి భయపడతారని తెలిపారు. ప్రశాంతంగా ఉంటుందన్నారు, ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉన్నందున ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అందుకు గ్రామస్తులు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. సిద్దిపేట జిల్లాలో సీసీ కెమెరాలు ఉండి పని చేయని సిసి కెమెరాలు విషయంలో, నూతన సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ప్రజాప్రతినిధులు వ్యాపారస్తులు పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. ప్రజలు కూడా ఇంటి ఆవరణలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో పట్టణాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు జియోట్యాగింగ్ ద్వారా సిద్దిపేట కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేసే తర్వాత హైదరాబాద్ కమాండ్ కంట్రోల్స్ సెంటర్ కు అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా షాపుల యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఒక కెమెరా రోడ్డు వైపు పెట్టుకోవాలని సూచించారు. వ్యాపారస్తులు ఎన్నో లక్షల డబ్బులు ఖర్చు పెట్టి షాపులు పెడతారు 20 నుండి 30 వేల రూపాయలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. ఏదైనా జరగరాని సంఘటన జరిగినా దొంగతనం జరిగిన నేరస్తులను పట్టుకోవడం సులభతరం అవుతుందన్నారు. సీసీ కెమెరాలు పెట్టడం ముఖ్యం మరియు అవి పని చేసే విధంగా ప్రతిరోజు మానిటర్ చేయడం చాలా ముఖ్యమని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ఆరేపల్లి మహదేవ్ గౌడ్, మాజీ సర్పంచ్, మమ్మద్ ఖలీల్, రమేష్, మంచాల శ్రీనివాస్ ఆరేపల్లి శ్రీనివాస్, రమేష్, వనజ, నాగప్రసాద్, శివకుమార్, శ్రీనివాస్, రాజేష్, ఐలయ్య, యెల్లం, శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీనివాస్, ఆంజనేయులను అభినందించి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, ఎస్ఐ చంద్రయ్య, గ్రామ ప్రజలు వ్యాపారస్తులు ప్రజాప్రతినిధులు, గ్రామ మహిళా సంఘాల మహిళా ప్రతినిధులు, స్కూల్ విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వానలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సీపీ అనురాధ

**సిద్దిపేట పవర్, సిద్దిపేట అర్బన్:** రేపు ఎల్లుండి మూడు రోజులు ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ సూచనలు చేశారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, కరెంట్ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. జిల్లాలో వర్షాలతో ఎవ్వరికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే డయల్ 100లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 కాల్ చేయాలని సూచించారు 24 గంటలు పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉంటారు. వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో కలసి పోలీస్ అధికారులు సిబ్బంది సమిష్టిగా సమన్వయంతో విధులు నిర్వహించాలి. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు కూడా వాయిదా వేసుకోవాలి. జిల్లావ్యాప్తంగా చెరువులు కుంటలు, వాగులు, వంకలు, నిండుకుండలా ఉన్నందున సంబంధిత గ్రామాల ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ ప్రకటన ప్రకారం జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల నీటి ప్రవాహం గురించి అన్ని జాగ్రత్త చర్యలు తీసుకొని ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షించాలని, జిల్లాలో కూడవెల్లి, మోయ తుమ్మెద వాగు శనిగరం చెరువు, కోమటి చెరువు, గజ్వేల్ పాండవుల, ఊడవెల్లి వాగు వెళ్లే దారి వెంట ఉన్న గ్రామాలు, ప్రజ్ఞాపూర్ ఊర చెరువు, నిండుకుండలా ఉన్నందున రహదారిపై ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీసులకు సూచించారు. సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా వరద ఉధృతతో రోడ్లు తెగిపోయిన, ఉదృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లవద్దని, రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ పొదలు, చెట్లు చెట్ల కొమ్మలు, కట్టెలు, లేదా స్టాపర్స్ పెట్టి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలతో, ప్రజాప్రతినిధులతో ఫోన్లో మాట్లాడి పరిస్థితి తెలుసుకుని తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పట్టణాలలో గ్రామాలలో మట్టితో కట్టిన పురాతన ఇండ్ల గురించి సమాచారం తెలుసుకుని, ఇండ్లు కూలే ప్రమాదంలో ఉంటే సంబంధిత అధికారుల సహకారంతో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. కావున అలాంటి ఇళ్ళల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాగులు చెరువులు కుంటలు వర్షపు నీటితో నిండిన క్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలను కుటుంబ సభ్యులను వాగులు చెరువులు కుంటలను తిలకించేందుకు ఎవరు వెళ్లవద్దని సూచించారు. నిర్విరామంగా కురిసే వర్షాల కారణంగా విద్యుత్ స్తంబాలకు ఎర్తింగ్ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యి కరెంట్ షాక్ తగిలే అవకాశం వున్నందున జిల్లా ప్రజలు పిల్లలు ఎవరు కూడా విద్యుత్ స్తంబాలను కానీ విద్యుత్ పరికరాలను ముట్టుకోకుండా జాగ్రత్తగా వుండాలని, అలాగే విద్యుత్ సరఫరాలో ఏదైనా లోపం ఉంటే వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదా వరత ఉద్ధ తి ఎక్కువ ఉన్న ప్రదేశాలలో ప్రాణనష్టం జరగకుండా ముందు జాగ్రత్తగా ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని సూచించారు. అలాగే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఏదైనా విపత్కర సమస్య వస్తే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ 8712667100 నెంబర్లకు సమాచారం అందించినచొ తక్షణ సహాయక రక్షణ చర్యలు చేపడుతామని పోలీస్ కమిషనర్ ఒక ప్రకటన లో తెలిపారు.

## బూస్టర్ తిరిగి తెచ్చి బిగించకపోతే మళ్లీ ధర్నా తప్పదు

- టిఆర్ఎస్ పార్టీ రైతులకు ఎప్పుడు అండగా ఉంటుంది
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి



**కౌడిపల్లి సిద్దిపేట పవర్ ప్రతినిధి:** మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో అక్రమంగా 50MVA బూస్టర్ ను సదాశివపేట్ కు షిఫ్ట్ చేసి దాని బదులు 10/16 MVA ని పెట్టడం వలన కౌడిపల్లి, కొల్చారం, చిలప్ చెడు మండలాలల్లో లో వోల్టేజ్ సమస్యతో రైతుల పంటలు ఎండిపోతుండడం మరియు వోల్టేజ్ సమస్యతో పంపు సెట్లు పాడవడం రాత్రి రెండు గంటల తర్వాత త్రీఫేస్ ఇవ్వడం వలన రైతులు తీవ్ర ఇబ్బందిగా గురవుతున్నారు. రైతులకు మద్దతుగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రైతులు,రైతుల కోసం బిఆర్ఎస్ పార్టీ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కౌడిపల్లి,కొల్చారం,చిలప్ చెడ్ మండలానికి సంబంధించి మండల అధ్యక్షులు మాజీ జడ్పిటిసిలు ఎంపీపీలు, ఎంపిటిసిలు సర్పంచులు గ్రామ అధ్యక్షులు వివిధ అనుబంధ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు ధర్నా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ ధర్నా పెద్ద ఎత్తున జరగడంతో స్పందించి విద్యుత్ అధికారులు ఏడి రమణారెడ్డి,ఏఈ శరత్ కుమార్ రావడంతో వారికి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రైతులతో కలసి మెమోరండం ఇవ్వడం జరిగింది. అనంతరం ఏడి స్పందిస్తూ వారం రోజుల్లో సదాశివపేటకు తరలించిన 50MVA బూస్టర్ ను తిరిగి కౌడిపల్లి విద్యుత్ సబ్స్టేషన్లో అమరుస్తామని తెలిపారు . ఈ సందర్భంగా సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులకు మంచి చేయకపోగా 24 గంటలు కరెంటు అని చెప్పి పూర్తిగా ఇవ్వకుండా రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని ఇలాగే ఉంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని రైతుల పక్షాన ఎప్పుడూ బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.వారం రోజులు కాదు పది రోజులలో బూస్టర్ ను తిరిగి అమర్చకపోతే మరోసారి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు మూడు మండలాల ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి గారు రైతులకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా ఎప్పుడు కూడా బిఆర్ఎస్ పార్టీ ముందు ఉంటుందని రైతు పక్షాన ప్రతిక్షణం పోరాటం చేయడం జరుగుతుందని తెలియజేశారు.

## కామారెడ్డి సభతో కాంగ్రెస్ సత్తా చాటాలి



- డీసీసీ అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి

**సిద్దిపేట పవర్ సిద్దిపేట సెప్టెంబర్ 11:** కామారెడ్డిలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తుముకుంట నర్సారెడ్డి మాట్లాడారు ఈ నెల 15న పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరిగే సభకు గరిష్ట సంఖ్యలో ప్రజలను సమీకరించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ శక్తిని చూపించాల్సి ఉంటుందని డిసిసి అధ్యక్షుడు తుంకుంట నర్సారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ పెంచుతూ అసెంబ్లీలో చట్టం తెస్తే అది జరగకుండా బీజేపీ కుట్ర పన్నుతోందని అన్నారు. గతంలో బీసీ డిక్లరేషన్ పేరుతొ పార్టీ ఇచ్చిన మాట కి కట్టుబడి ఉందని అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అద్వర్యం లో ప్రజలకి అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు యూరియా పేరుతో కేంద్రం లో ఉన్న బీజేపీ ప్రభుత్వం కొరత శ్రుష్టించి దళారులకి యూరియా దోచిపెట్టి రైతులను అభాసుపాలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందిస్తోందని అన్నారు.రాబోయె స్థానిక ఎన్నికలలో అందరూ కార్యకర్తలు కష్టపడి అత్యాదిక స్థానాలు గెలుచుకోవాలని కోరారు ఈ కార్యక్రమ్ లో సిద్దిపేట జిల్లా ఆర్టీఏ సభ్యుడు డాక్టర్ సూర్యవర్మ, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం , డీసీసీ అధికార ప్రతినిధి బుచ్చి రెడ్డి ,వైస్ ప్రెసిడెంట్ మందా పాండు , సదాశివరెడ్డి ,నాయిని నర్సింహారెడ్డి , నాయకులు పలువురు పాల్గొన్నారు